సాక్షి ఖమ్మం

సోమవారం : 22 : జనవరి : 2024



పగిలితే పండగే..!

వైరాలోని మద్యం డిపోలో ఎన్ని సీసాలు పగిలితే ఉద్యోగులకు అంత లాభాల పంట పండుతుండడంతో వారు ఆనందిస్తున్నారు. 8లో



చిన్నారులను మింగిన గుంత

బాతుపిల్లతో ఆడుకుంటూ నీటి గుంతలో పడి ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడిన విషాద ఘటన కాకర్లపల్లిలో చోటుచేసుకుంది. 8లో



వాతావరణం

జిల్లాలో సోమవారం మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి, ఉదయం వేళల్లో చలి ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు జమలాపురంలో సీతారాముల కల్యాణం

ఎర్రుపాలెం: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శ్రీసీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఈఓ కె.జగన్మోహన్‌రావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. భక్తులు భారీగా తరలివచ్చి సీతారాముల కల్యాణాన్ని తిలకించాలని, స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

రైల్వేలైన్ ఏర్పాటుకు లొకేషన్ సర్వే

కూసుమంచి: గత మూడు రోజులుగా వివిధ ప్రాంతాల్లో తక్కువ ఎత్తులో విమానం చక్కర్లు కొడుతుండగా.. అది రైల్వే లైన్ సర్వే కోసం అంటూ సంబంధిత అధికారులు వివరణ ఇచ్చారు. రూ.5,330 కోట్లతో 296 కిలోమీటర్ల మేర నిర్మించే డోర్నకల్–గద్వాల నూతన రైల్వే లైన్ నిర్మాణానికి పలు ప్రాంతాల్లో లొకేషన్ సర్వే చేపట్టినట్లు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి సీహెచ్. రాకేష్ పేరున ఆదివారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఖమ్మం జిల్లాలోని కూసుమంచి, పాలేరు, సూర్యాపేట జిల్లాలోని మోతె, సూర్యాపేట మండలాల్లో ఈ సర్వే చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ లైన్ అందుబాటులోకి వస్తే సిమెంట్, గ్రానైట్ రవాణాకు అనుకూలంగా ఉంటుందని తెలిపారు.

ఆన్‌లైన్ ప్రదర్శనల మూల్యాంకనం పూర్తి

ఖమ్మం సహకారనగర్: సృజనాత్మక ఆలోచనలతో ప్రయోగాలు, చిరుధాన్యాలపై సెమినార్, ఉపాధ్యాయుల వినూత్న బోధనా పరికరాల ప్రదర్శనలకు సంబంధించి జిల్లాలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థుల నుంచి వచ్చిన ఐదు అంశాలపై ఆన్‌లైన్ మూల్యాంకనం పూర్తయిందని డీఈఓ ఈ.సోమశేఖర శర్మ తెలిపారు. ఇటీవల జిల్లా స్థాయి సైన్స్, గణిత, వైజ్ఞానిక ప్రదర్శనలను ఆన్‌లైన్ ద్వారా స్వీకరించిన విషయం తెలిసిందే. నగరంలోని శ్రీనగర్ కాలనీ రెజొనెన్స్ పాఠశాలలో మూల్యాంకనం చేపట్టామని, అన్ని అంశాల్లో కలిపి 187 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌లు రాగా 8 మంది ప్రధానోపాధ్యాయులు న్యాయ నిర్ణేతలుగా నలుగురు సభ్యుల టెక్నికల్ బృందంతో కలిసి సీనియర్, జూనియర్లను వేర్వేరుగా ప్రథమ, ద్వితీయ తృతీయ బహుమతులకు ఎంపిక చేశారని వివరించారు. ప్రథమ స్థానం పొందిన విద్యార్థులను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. జిల్లా సైన్స్ అధికారి దుస్సా జగదీశ్వర్ పర్యవేక్షణలో ఈ ప్రక్రియ పూర్తయిందని పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన రెజొనెన్స్ కరస్పాండెంట్ కొండా శ్రీధర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

త్వరలో సబ్‌కోర్టు ఏర్పాటు



కోర్టు ప్రాంగణంలో జిల్లా జడ్జి జగ్జీవన్‌కుమార్ తదితరులు

మధిర: మధిరలో త్వరలోనే సబ్ కోర్టును ప్రారంభిస్తామని జిల్లా జడ్జి బీహెచ్ జగ్జీవన్ కుమార్ తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నిర్వహణకు గాను ఆదివారం ఆయన స్థానిక సమీకృత రైతు బజార్, మార్కెట్ యార్డ్ భవనాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పాత కోర్టు భవనంలో ఉన్న రికార్డులను వెంటనే తరలించాలని, ఆ స్థానంలో నూతన భవన నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను కోరారు. కార్యక్రమంలో మధిర కోర్టు న్యాయమూర్తి టి.కార్తీక్ రెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలంటౌన్: శ్రీసీతారామ చంద్రస్వామివారి నిత్యకల్యాణ వేడుక ఆదివారం కనుల పండువగా సాగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘటాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

సాయం..ఇక వేగిరం

రెండెకరాల్లోపు వారికి రైతుబంధు నగదు

- నెలాఖరు నాటికి రైతులందరి ఖాతాల్లో జమ
- వచ్చే సీజన్‌లో ఎకరాకు రూ.15 వేలు అందే అవకాశం
- అన్నదాతల్లో చిగురిస్తున్న ఆశలు



కూసుమంచి మండలంలో సాగు చేస్తున్న యాసంగి వరి

ఖమ్మంవ్యవసాయం : రైతుబంధు వేగం పుంజుకుంది. యాసంగి పంటలు సాగవుతున్న వేళ రైతుల బ్యాంకు ఖాతాల్లో పెట్టుబడి సాయం జమవుతోంది. రాష్ట్రంలో కొలువుదీరిన కొత్త ప్రభుత్వం యాసంగి రైతుబంధులో ఎలాంటి మార్పులు చేయకుండా గత సర్కారు అనుసరించిన విధానాన్నే అమలు చేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో డిసెంబర్ 12 నుంచి తక్కువ భూమి కలిగిన రైతుల ఖాతాల్లో సాయం జమ చేస్తూ క్రమంగా ఎక్కువ భూమి ఉన్న రైతులకు కూడా అందిస్తోంది. ఈ పథకం ఆరంభంలో నత్తనడకన సాగగా.. ఆ తర్వాత కొద్ది రోజులు నగదు జమ జరగలేదు. కాగా, వారం రోజులుగా ఈ ప్రక్రియ పుంజుకుంది. ఈ నెలాఖరు నాటికి రైతులందరి ఖాతాల్లో నగదు జమ చేసే ప్రయత్నంలో ప్రభుత్వం ఉంది. ఇప్పటి వరకు రెండెకరాల వరకు భూమి గల రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమైంది. రాష్ట్రంలో సన్న, చిన్నకారు రైతుల సంఖ్య అధికంగా ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో నీటి వనరులున్న ప్రాంతాల్లో రైతులు వరి, మొక్కజొన్నతో పాటు ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు.

2.30 లక్షల మంది ఖాతాల్లో జమ..

రెండెకరాల వరకు భూమి ఉన్న రైతుల ఖాతాల్లో ఇప్పటివరకు ప్రభుత్వం పెట్టుబడి సాయం జమ చేసింది. ఖమ్మం జిల్లాలో 3.42 లక్షల మంది రైతులు పథకానికి అర్హులు కాగా, ఇప్పటివరకు 1.60 లక్షల మందికి, భద్రాద్రి జిల్లాలో 1.78 లక్షల మందికి గాను 70 వేల మంది రైతులకు రైతుబంధు సాయం అందింది. రెండెకరాలకు మించి భూమి ఉన్న రైతులందరికీ ఈ నెలాఖరు నాటికి నగదు జమ అయ్యే అవకాశాలు ఉన్నాయి. డిసెంబర్ 12న ఈ ప్రక్రియ ప్రారంభమైనప్పటికీ.. జనవరి ఆరంభంలో పూర్తిగా కుటంపడింది. ఉద్యోగులకు వేతనాల చెల్లింపు, ఆర్థిక లోటు తదితర కారణాలతో రైతుబంధుకు ఆటంకం ఏర్పడిందనే చర్చ జరిగింది. తిరిగి కొద్ది రోజులుగా నగదు జమను వేగవంతం చేశారు.

రానున్న సీజన్‌పై మరిన్ని ఆశలు..

తాము అధికారంలోకి వస్తే ఏడాదికి ఎకరాకు రూ.15 వేలు పెట్టుబడి సాయం అందిస్తామని ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రకటించింది. అనుకున్నట్టుగా విజయం సాధించడంతో ఆ హామీ మేరకు ఏడాదికి రెండు సీజన్లకు గాను ఎకరాకు రూ.15 వేలు జమ చేసే అవకాశం ఉంది. వచ్చే వానాకాలం సీజన్ నుంచి ఈ నిర్ణయం అమలవుతుందని రైతులు ఆశిస్తున్నారు. ఆ విధంగా అందితే రైతులకు కొంత వెసులుబాటు కలిగే అవకాశం ఉంటుంది.

‘సాయం’ పెరిగితే ప్రయోజనం



పంటల సాగుకు పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. పరిస్థితులు అనుకూలించక దిగుబడులు తగ్గుతున్నాయి. కొన్నిసార్లు కనీసం పెట్టుబడి కూడా రాక నష్టపోతున్నాం. కొందరు రైతులు వ్యవసాయంపై విరక్తి చెంది ఇతర పనులకు వెళ్తున్నారు. ఈ పరిస్థితుల్లో పెట్టుబడి సాయాన్ని పెంచితే కొంత ఆసరాగా ఉంటుంది.

– వేల్పుల రామయ్య, పోలిశెట్టిగూడెం, ఖమ్మం రూరల్ మండలం

వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి



ప్రభుత్వాలు వ్యవసాయానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలి. పంటల సాగులో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే తీవ్రంగా నష్టపోతున్నాం. పెట్టుబడి సాయాన్ని పెంచాల్సిన అవసరం ఉంది. వచ్చే సీజన్ నుంచి ఎకరాకు రూ.15 వేలు ఇస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

– ఆపతి రామారావు, అన్నారుగూడెం, తల్లాడ మండలం

రైతులకు ఎంతో మేలు



పంటల సాగుకు పెట్టుబడి సాయం ఎంతో అవసరం. సాగు సమయంలో రైతులు ఇబ్బంది పడకుండా రైతుబంధు నగదుతో ప్రయోజనంగా ఉంటుంది. విత్తనాలు, ఎరువుల కొనుగోలుకు ఈ పథకం ఎక్కువగా ఉపకరిస్తుంది. ప్రస్తుతం యాసంగి సీజన్ పెట్టుబడి సాయం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమవుతోంది.

– ఎం.విజయనిర్మల, జిల్లా వ్యవసాయాధికారి, ఖమ్మం

జిల్లాలో యాసంగి రైతుబంధు పథకం వివరాలు	అర్హులైన రైతుల సంఖ్య	మంజూరైన నిధులు	ఇప్పటివరకు నగదు జమైన రైతుల సంఖ్య	జమైన మొత్తం
	3,42,799	రూ.360.30 కోట్లు	1,60,417	రూ.62.63 కోట్లు

క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచండి
- వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉండాలి
- అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన కలెక్టర్ గౌతమ్

ఖమ్మం సహకారనగర్ : అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ, పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ జవాబుదారీగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి ఆదివారం ఆయన పాలేరు నియోజకవర్గ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. అధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, ప్రభుత్వ వ్యవస్థలపై నమ్మకం కలిగేలా వ్యవహరించాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు 24 గంటలూ అందుబాటులో ఉండాలని, ఏ సమయంలో అయినా డాక్టర్ ఉంటారనే నమ్మకం ప్రజల్లో కలగాలని అన్నారు. తాను ఆకస్మిక తనిఖీలు చేస్తానని, నిర్లక్ష్యంగా ఉండే అధికారులు, సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, మార్చి నెలాఖరులోగా అన్ని హెల్త్ సబ్ సెంటర్ల భవనాలు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం బోధనను పటిష్ట పరచాలన్నారు. మూతబడిన పాఠశాలల వివరాలు సమర్పించి, వాటి పునఃప్రారంభానికి చర్యలు తీసుకోవాలని చెప్పారు. వేసవి సెలవుల్లోనే పిల్లల నమోదుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని సూచించారు. ఎంఈఓల ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోవాలని, ఆర్‌ఎంఎస్‌ఏ ద్వారా చేపట్టిన పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. నర్సింగ్ కళాశాల భవనం నాణ్యతా ప్రమాణాలతో, నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలన్నారు.

భవన నిర్మాణాలకు చర్యలు..

తిరుమలాయపాలెం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ 30 పడకల నుంచి 100 పడకలకు అప్ గ్రేడ్ అయిందని, అందుకు అనుగుణంగా భవనాల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని పొంగులేటి అధికారులకు సూచించారు. నేలకొండపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఆపరేషన్ థియేటర్, కాంపౌండ్ వాల్ తదితర పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కూసుమంచిలో ఆయుష్ భవన నిర్మాణం పూర్తి చేయాలన్నారు. టెండర్ ప్రక్రియలో ఉన్న చెక్ డ్యామ్ పనుల వివరాలు సమర్పించాలని అన్నారు. పాలేరు కెనాల్ మెయిన్ అప్ స్ట్రీమ్, డౌన్ స్ట్రీమ్‌లో ఉన్న భూముల నీ్న డీమార్కు చేసి, ఫెన్సింగ్ చేపట్టాలన్నారు. నాయకన్‌గూడెంలో ఐబీ విశ్రాంతి గృహ నిర్మాణానికి టెండర్ రీకాల్ చేయాలని చెప్పారు.

పనుల వివరాలు సమర్పించండి..

ఎస్‌ఎస్పీ, ఎస్డారెస్పీ మంజూరు పనుల పురోగతిపై నివేదిక సమర్పించాలని మంత్రి పొంగులేటి అన్నారు. పెద్దతండా, ఏదులాపురం, గుదిమల్ల, చిన్నవెంకటగిరి గ్రామాల్లో పురోగతిలో ఉన్నవి, ఇంకా ప్రారంభం కాని పనుల వివరాలు సమర్పించాలని ఆదేశించారు. మహాలక్ష్మి పథకంతో మహిళా ప్రయాణికులు పెరిగారని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, సేకరించాల్సిన భూమిలో వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలు సమర్పించాలని అన్నారు. గ్రామాల్లో అవసరమైన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. పాలేరు నియోజకవర్గానికి మంజూరైన మినీ స్టేడియం నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. మద్దులపల్లి మార్కెట్ నిర్మాణ పనులు జూలై నాటికి పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్ నాయక్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ మయాంక్ సింగ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో నేడు, రేపు మంత్రి తుమ్మల పర్యటన

ఖమ్మంవన్‌టౌన్: రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి 10.30 గంటలకు కోదాడలో మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు నివాసంలో కాసేపు ఆగుతారు. 11 గంటలకు అక్కడ నుంచి బయలుదేరి 11.30గంటలకు ఖమ్మం శ్రీనివాసనగర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారు. 4 గంటలకు రఘునాథపాలెం మండలం పంగిడి, 5 గంటలకు ఈర్లపుడిలో కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తారు. 5.30గంటలకు కోయచెలకలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. మంగళవారం ఉదయం 10 గంటలకు నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించే సమీక్షలో పాల్గొంటారు.

సర్వత్రా సందడి..



ఖమ్మంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్న రామభక్తులు

- జిల్లాలో మార్మోగుతున్న రామనామం
- రంగులు, ముగ్గులు, దీపాలతో వేడుకకు సిద్ధం

ఖమ్మంగాంధీచౌక్: ఎక్కడ చూసినా బాల రామ విగ్రహ ప్రతిష్ఠ సందడే.. ఏ నోట విన్నా రామనామమే.. సోమవారం అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తుండగా జిల్లాలోనూ రామ భక్తులు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అయోధ్య అక్షింతలు ఇంటింటా పంచి బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ గురించి పలువురు ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యాప్తంగా దేవాలయాలను శుభ్రం చేస్తూ నేటి కార్యక్రమాలకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేసుకున్నాయి. ప్రధానంగా రామ, ఆంజనేయ స్వామి ఆలయాల్లో ఈ వేడుకలు మరింత ఎక్కువగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే జరిగిన విస్తృత ప్రచారంతో ప్రతి ఇంటిపై శ్రీరామచంద్రుడు, ఆంజనేయుడి చిత్రపటాలతో కూడిన కాషాయ జెండాలు ఎగురవేశారు. ఇళ్ల ముందు, అపార్టుమెంట్ల వద్ద జై శ్రీరామ్ పేరిట ఉన్న జెండాలు, కాషాయ జెండాల తోరణాలు కట్టారు. మోటారు సైకిళ్లతో భారీ ర్యాలీలు నిర్వహించారు. కొన్ని సంస్థలు బాల రామ విగ్రహ ప్రతిష్ఠకు సంబంధించిన పోస్టర్లు, ఫ్లెక్సీలతో విస్తృత ప్రచారం చేశాయి.

అంతటా పండుగ వాతావరణం..

బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పండుగలా నిర్వహించేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారు. తెల్లవారుజామునే నిద్రలేచి ఇంటిని శుభ్రం చేసుకోవాలని, తలంటు స్నానం చేసి కొత్తబట్టలు ధరించాలని, పూలు, మామిడి తోరణాలను ఇళ్లకు అలంకరించాలని, ప్రతి ఇంటిపై శ్రీరామచంద్రుడు, ఆంజనేయుడు ఫొటోలతో కూడిన జెండాలు ఎగురవేయాలని, ఇళ్ల ముంగిట రంగురంగుల ముగ్గులు వేసుకోవాలని పలు సేవా సంస్థలు, విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించారు. మధ్యాహ్నం 12:29 గంటలకు అయోధ్యలో నిర్వహించే రామ్‌లల్లా విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని టీవీల్లో వీక్షించి తరించాలని పిలుపునిచ్చారు. తమ స్థాయిని బట్టి పేదలకు అవసరమైన సాయం చేయాలని సూచించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు..

బాలరామ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. అయోధ్యలో జరిగే వేడుకను ప్రజలు సామూహికంగా వీక్షించేలా గ్రామాల్లో పెద్ద స్క్రీన్లను ఏర్పాటు చేస్తున్నారు. ఖమ్మం నగరంలోని గాయత్రి భవన్ వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శ్రీరామనవమిని తలపించేలా కార్యక్రమాలు నిర్వహించేందుకు సిద్ధమయ్యారు.

కిన్నెరసానిలో ‘అద్భుత’ద్వీపం!

రిజర్వాయర్‌లోని ఆనందద్వీపం అభివృద్ధికి అడుగులు

- మూడేళ్ల క్రితం పరిశీలించిన సింగపూర్ బృందం
- తాజాగా ఎకో టూరిజం డెవలప్‌మెంట్‌కు పీసీసీఎఫ్ ఆదేశాలు



కిన్నెరసాని జలాశయం మధ్యలో ఉన్న ఐలాండ్ (ఆనందద్వీపం)

పాల్వంచరూరల్: అనేక హంగులతో ఆకట్టుకుంటున్న కిన్నెరసాని మెడలో మరో మణిహారం చేరనుంది. పర్యాటకులకు అద్భుత అనుభూతులు మిగిల్చేలా ఆనందద్వీపం (ఐలాండ్) అభివృద్ధిపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. మినీ ఊటీని తలపించే పర్యాటక ప్రాంతమైన కిన్నెరసాని రిజర్వాయర్ మధ్య ఉన్న ఐలాండ్ అభివృద్ధికి నాటి కలెక్టర్ రజత్‌కుమార్‌శైనీ చొరవ చూపారు. ఆయన బదిలీ అయిన తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. తాజాగా శుక్రవారం పీసీసీఎఫ్ సి.సువర్ణ జిల్లా పర్యటనలో భాగంగా కిన్నెరసాని జలాశయంలోని ఆనంద ద్వీపాన్ని కూడా సందర్శించారు. అభివృద్ధికి అన్ని అవకాశాలు ఉండటంతో పర్యాటకులను ఆకట్టుకునేలా ఎకో టూరిజాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. దీంతో ఆనందద్వీపం అభివృద్ధికి వడివడిగా అడుగులు పడనున్నాయి.

2019లో తొలిసారి ప్రణాళిక

జిల్లా నలుమూలల నుంచేకాకుండా ఇతర ప్రాంతాల నుంచి కూడా పర్యాటకులు కిన్నెరసానికి వస్తుంటారు. వారిని ఆకర్షించేలా అభివృద్ధి చేయాలని 2019లో అప్పటి కలెక్టర్ శైనీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఆయన సూచనల మేరకు 2019, డిసెంబర్ 10న సింగపూర్‌కు చెందిన ఏబాని కంపెనీకి చెందిన అర్కిటెక్ డైరెక్టర్ సీపీ రాజు, అజయ్, నిధి అగర్వాల్ బృందం ఐలాండ్‌ను పరిశీలించింది. ఐలాండ్ మధ్యలో చెట్లపై వాకింగ్ చేసేలా ట్రాక్, ఐలాండ్ చుట్టు ఫెన్సింగ్, రాత్రి సమయంలో పర్యాటకులు బస చేసేందుకు సోలార్ విద్యుత్ సౌకర్యం ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశారు. మొదట ఐలాండ్‌ను శుభ్రపరిచారు. పర్యాటకులు కూర్చునేందుకు సిమెంట్ బల్లాలను ఏర్పాటు చేసి ఐలాండ్‌కు ఆనందద్వీపంగా పేరు పెట్టారు. ఆ తర్వాత కలెక్టర్ శైనీ బదిలీ కావడంతో ఐలాండ్ అభివృద్ధి పనులు ఆటకెక్కాయి.

సమీపంలోనే కాటేజీలు

గత శుక్రవారం కిన్నెరసానిని సందర్శించిన పీసీసీఎఫ్ సువర్ణ ఆనందద్వీపాన్ని పరిశీలించి ఎకో టూరిజం అభివృద్ధికి అవకాశాలు ఉన్నాయని గుర్తించారు. గతంలో సిద్ధమైన ప్రతిపాదనలను అధికారులు ఆమె దృష్టికి తీసుకెళ్లగా అభివృద్ధి పనులు చేపట్టాలని ఆమె సూచించడంతో అధికారులు రంగంలోకి దిగారు. ఇప్పటికే జలాశయం పక్కన టూరిజం శాఖ తొమ్మిది కాటేజీలను నిర్మిస్తోంది. ఇవి పూర్తయితే పర్యాటకులు జలాశయం మధ్యలో ఉన్న ఆనంద ద్వీపంలోకి వెళ్లి రాత్రి బస చేసే అవకాశం ఏర్పడుతుందని చెబుతున్నారు. ఇప్పటికే రెండు రోజులుగా ద్వీపంలో చెట్లు, పొదల తొలగింపు పనులు జరుగుతుండగా.. సోలార్ లైట్లు కూడా బిగిస్తున్నారు. ఆనందద్వీపం అందుబాటులోకి వస్తే పర్యాటకుల సంఖ్య పెరిగి ఇటు అటవీ, అటు టూరిజం శాఖలకు ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

క్లుప్తంగా

ట్రాన్స్‌జెండర్‌ను పెళ్లి చేసుకున్న యువకుడు



నక్షత్రను వివాహం చేసుకుంటున్న నందు

ఏన్కూరు : ఇన్‌స్టాగామ్ ద్వారా మూడేళ్ల పాటు ప్రేమించిన ట్రాన్స్‌జెండర్‌ను ఓ యువకుడు వివాహం చేసుకున్న ఘటన ఏన్కూరు మండలం గార్లఒడ్డు శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఆదివారం జరిగింది. ఏన్కూరుకు చెందిన నక్షత్ర అనే ట్రాన్స్‌జెండర్‌కు ఆంధ్రప్రదేశ్ ఎన్‌టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం వేమిరెడ్డిపల్లి తండాకు చెందిన ఆజ్మీర నందుకు ఇన్‌స్టాగామ్ ద్వారా పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుందామని నిర్ణయించుకోగా నందు తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో ఇద్దరూ గార్లఒడ్డు ఆలయంలో వివాహం చేసుకున్నారు.

ఎంపీ రవిచంద్రతో కేఏ పాల్ భేటీ



ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో కేఏ పాల్

ఖమ్మంమయూరిసెంటర్: రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఆదివారం రాత్రి హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఎంపీ రవిచంద్ర నివాసానికి విచ్చేసిన కేఏ పాల్ ఆయనతో సుమారు గంట పాటు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తెలుగు రాష్ట్రాల్లో కాపుల స్థితిగతులు.. రాజకీయ చైతన్యం.. కాపుల ఓటు బ్యాంకు.. ఐక్యత.. రాబోయే ఏపీ ఎన్నికల్లో కాపులు తీసుకోవాల్సిన నిర్ణయం తదితర అంశాలు వీరి మధ్య చర్చకు వచ్చాయి.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



షేక్ ఆరీఫ్‌పాషా (ఫైల్)

పెనుబల్లి: మండలంలోని పార్థసారధిపురం గ్రామానికి చెందిన షేక్ ఆరీఫ్‌పాషా (23) పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. షరీఫ్ ఆత్మహత్యపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

పురుగులమందు తాగి వృద్ధురాలు మృతి

పెనుబల్లి: మండలంలోని ఉప్పలచెలక గ్రామానికి చెందిన కొలేటి వెంకమ్మ (65) కడుపు నొప్పి తాళలేక పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను పెనుబల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సూరజ్ తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

రఘునాథపాలెం: మండలంలోని బద్యాతండాకు చెందిన వ్యక్తి పురుగుమందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. సీఐ శ్రీధర్ కథనం ప్రకారం.. బి.మంగ్యా (55) అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 18న పురుగులమందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ శ్రీధర్ వివరించారు.

కోడిపందేల స్థావరంపై దాడి

పెనుబల్లి: మండలంలోని గంగదేవిపాడు గ్రామ శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. రెండు పందెం కోడిపుంజులు, రెండు కోడి కత్తులు, మూడు బైక్‌లు, రూ.1,250 నగదు స్వాధీనం చేసుకొని, పరారీలో ఉన్న ఐదుగురు వ్యక్తుల్లో ఒకరిని అరెస్టు చేశామని, మిగతావారి కోసం గాలింపు చేపట్టినట్లు ఎస్‌ఐ సూరజ్ తెలిపారు.

ద్విచక్రవాహనం చోరీ

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామానికి చెందిన కల్లెల్ల కుమార్‌కు చెందిన ద్విచక్ర వాహనాన్ని ఆదివారం మధ్యాహ్నం చోరీ చేశారు. లక్ష్మీనగరం గ్రామంలోని తన దుకాణం ఎదుట నిలిపి ఉంచిన టీఎస్ 28 జే 1440 నంబర్ గల ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తి అపహరించి, తీసుకెళ్తున్న విజువల్స్ సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. పట్టపగలు భారీ జనసంచారం ఉన్న సమయంలో బైక్ చోరీ కావడంపై గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,448

పగిలితే పండగే..!

వైరా ఐఎంఎల్ డిపోలో అధికారుల లీలలు

- రవాణాలో పగిలిన సీసాల కంటే ఎక్కువగా నమోదు
- ఆపై బాటిళ్లు బయట వ్యాపారులకు తక్కువ ధరతో విక్రయం
- లాభాలు ఉండడంతో డిపోలో విధులు నిర్వర్తించేందుకు పోటాపోటీ





వైరాలోని ఐఎంఎల్ మద్యం డిపో (ఇన్‌సెట్) కొన్నేసి బాటిళ్లు పగలడంతో పక్కన పెట్టిన కేసులు

వైరా: ఇంట్లో ఏదైనా బాటిల్ పగిలితే మన గుండె పగిలినంత బాధపడతాం.. ఇక మద్యపాన ప్రియులైతే చేతిలోని సీసా పగిలితే వారి బాధ చెప్పనలవి కాదు. కానీ వైరాలోని మద్యం డిపోలో ఎన్ని సీసాలు పగిలితే ఉద్యోగులు అంత ఆనందిస్తుంటారు. ఎందుకంటారా? అలా పగిలితేనే వారికి లాభాల పంట పడుతుంది.. చేతిలో డబ్బు కళకళలాడుతుంది! ఈ రహస్యాన్ని వంట పట్టించుకున్నందునే డిపోలో డ్యూటీ వేయించుకునేందుకు పోటీ పడుతుంటారు. ఒకసారి డ్యూటీలో చేరితే ఇక వదిలేందుకు అసలే ఇష్టపడరు.

యథేచ్ఛగా చేతివాటం

వైరాలోని ఐఎంఎల్(ఇండియన్ మేడ్ లిక్కర్) డిపోలో సిబ్బంది బహిరంగంగానే చేతివాటం ప్రదర్శిస్తున్నారు. డిపోలో తక్కువ డ్యామేజ్‌ను ఎక్కువగా చూపి సొమ్ము చేసకుంటున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ డిపో నుంచే ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా బార్లు, వైన్స్‌కు మద్యం సరఫరా చేస్తుంటారు. వివిధ కంపెనీల సరఫరాదారుల ద్వారా వచ్చిన మద్యాన్ని డిపోల్లో నిల్వ ఉంచుతారు. ఇదిలా ఉండగా మద్యం సరఫరాకు సంబంధించిన లోడింగ్, అన్‌లోడింగ్ సమయంలో కొంత మేర డ్యామేజ్ కావడం సహజం. అయితే ఇక్కడ పగిలిన బాటిళ్లను డ్యామేజ్‌ను లాస్ కింద చూపించడాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు డ్యామేజ్‌ను ఎక్కువగా చూపుతున్నారు. ఈ తతంగం చాలాకాలం నుంచి జరుగుతోంది.

ఒకటికి రెండుగా లెక్క

డిపోలో ఒక బాటిల్ పగిలితే రెండు లెక్కరాస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం, మామూలుగా ఐదు బాక్సుల(కాటన్లు) లిక్కర్, బీర్ డ్యామేజ్ అయితే 10 బాక్సులు డ్యామేజ్ అయినట్లు చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో పగిలిన సీసాల పేరు చెప్పి మిగుల్చుకున్న మద్యం బాటిళ్లను తమకు కావాల్సిన వారు నిర్వహించే బార్‌లు, వైన్స్ షాపులకు సరాసరి ధరకు అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. డ్యామేజ్ అయన సరుకుకు అధికారికంగా ఎలాంటి బిల్లులూ ఉండకపోవడం వీరి తెరచాటు వ్యవహారానికి దోహదపడుతోంది. డిపోలో ధర కన్నా తక్కువకు కొందరు సిబ్బంది సరుకు బయటకు ఇస్తుండటంతో వైన్స్ యజమానులు వాటిపై ఎక్కువగా మక్కువ చూపుతున్నారని సమాచారం. ఈ విధంగా వచ్చిన రోజువారి ఆదాయం తిలాపాపం తలా పిడికెడు అన్న చందంగా వాటాలుగా అందరికీ అందుతోందని తెలిసింది.

ప్రతిరోజు ఆదాయం రూ.వేలల్లోనే...

ఐఎంఎల్ డిపోలకు రోజు వారీగా పదుల సంఖ్యలో లారీలు మద్యాన్ని తీసుకొస్తుంటాయి. ఇక్కడి నుండి తిరిగి రెండు జిల్లాల్లోని వైన్స్‌లు, బార్ షాపులకు అదే స్థాయిలో వెళ్తుంటాయి. అయితే ఒక్కో లారీలో తక్కువలో తక్కువ రెండు మూడు బాక్సులైనా పగిలినట్లుగా ఇక్కడి సిబ్బంది చూపుతున్నట్లు సమాచారం, రవాణా సమయంలో డ్యామేజీ అయితే సదరు కంపెనీ వారే ఆ నష్టాన్ని భరించాల్సి ఉంటుంది. అంటే రోజుకు డిపోలో పది నుంచి పదిహేను బాక్సులనైనా ఇక్కడి వారు డ్యామేజీ కింద చూపుతారని తెలుస్తోంది. ఓ కంపెనీకి చెందిన క్వార్టర్ బాటిళ్ల మద్యం ఒక్కో బాక్సు ధర వైన్స్ షాపులో పెరిగిన ధరల ప్రకారం రూ.4 వేల నుంచి రూ.5 వేల మధ్యలో ఉంటుంది. ఒక రోజు ఈ కంపెనీకి చెందిన కనీసం ఐదు బాక్సులు డ్యామేజీ చూపితే ఒక్కో బాక్సుకు రూ.2 వేల చొప్పున ఐదు బాక్సులకు సుమారుగా రూ.10 వేల వరకు ఆదాయం వస్తుందని తెలుస్తోంది.

విధుల కోసం పోటాపోటీ

వైరాలోని ఐఎంఎల్ డిపోలో పని చేసేందుకు ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది ఎంతో ఇష్టపడతారు. ఇక్కడ పని చేస్తే వేతనంతో పాటు చేతి నిండా ఆదాయం ఉంటుందనే ఉద్దేశంతో ఎక్సైజ్ వారు ఐఎంఎల్ డిపోలో పని చేసేందుకు పోటీ పడతారని శాఖాపరంగా అందుతున్న సమాచారం. ఇందుకోసం ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులకు ముడుపులు ముట్టజెప్పి మరీ పోస్టింగ్‌లు వేయించుకుంటారు. ఇక్కడ పని చేస్తున్న కొద్ది మంది అధికారులు బదిలీలు లేకుండా ఏళ్ల తరబడి పనిచేస్తున్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

స్పష్టత ఇవ్వని యాజమాన్యం



సింగరేణి ప్రధాన కార్యాలయం ముఖద్వారం

- సింగరేణిలో కదలని జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగ నియామక ప్రక్రియ
- ఆందోళన చెందుతున్న అభ్యర్థులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాల విషయంలో స్పష్టత ఇవ్వడంలేదు. సంస్థ గతేడాది జూనియర్ అసిస్టెంట్ గ్రేడ్–2(క్లర్క్) పోస్టుల భర్తీకి పరీక్ష నిర్వహించి, ఫలితాలు విడుదల చేసింది. అయితే పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగాయని కొందరు అభ్యర్థులు హైకోర్టుకు వెళ్లారు. దీంతో పరీక్షలు రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించగా, సింగరేణి యాజమాన్యం ఆ తీర్పును సవాల్ చేస్తూ డివిజన్ బెంచ్‌లో పిటిషన్ వేశారు. పరీక్ష మళ్లీ నిర్వహించాల్సిన అవసరం లేదని, నియామకాలు చేపట్టాలని డివిజన్ బెంచ్ తీర్పు వెలువరించింది. దీంతో ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ సింగరేణి అధికారులు గత డిసెంబర్ 18వ తేదీన 146 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు. మరుసటి రోజే నియామక ప్రక్రియ నిలిపివేశారు. సింగరేణిలో ఎన్నికల కోడ్ ఉందని, కోడ్ ముగిశాక తిరిగి ప్రక్రియ ప్రారంభిస్తామని సింగరేణి అధికారులు పేర్కొన్నారు. డిసెంబర్ 28న కోడ్ ముగిసినా నియామక ప్రక్రియలో ఎలాంటి కదలికలేదు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో డిసెంబర్ 30న జరిగిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో కూడా దీనిపై చర్చించలేదు. అప్పటి నుంచి సింగరేణి యాజమాన్యం కాలయాపన చేస్తుందే తప్ప చర్యలు తీసుకోవడంలేదు. డిసెంబర్ 27న జరిగిన ఎన్నికల్లో గుర్తింపు సంఘంగా ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘంగా ఐఎన్‌టీయూసీ గెలిచినా, ఈ విషయంలో నోరుమెదపక పోవటం శోచనీయం. దీంతో నియామక పత్రాలు అందుకున్న అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు.

ఆందోళన నిర్వహిస్తాం



సింగరేణి యాజమాన్యం జూనియర్ అసిస్టెంట్ల విషయంలో దోబుచులాడుతోంది. వెంటనే నియామక ప్రక్రియ పూర్తి చేయాలి. సంస్థలో ఇంకా 800 క్లరికల్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని కూడా భర్తీ చేయాలి. ఈ సమస్యలపై మా యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తాం.

–రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ అధ్యక్షుడు

గొలుసు చోరీల నిందితుడు అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మోహన్‌బాబు

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి పట్టణంలో వరుసగా మూడు చోరీలకు పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రూ.3.20 లక్షల సొత్తును స్వాధీనం చేసుకున్నారు. వివరాలను పట్టణ సీఐ మోహన్‌బాబు ఆదివారం తెలిపారు. వేంసూరు మండలం లచ్చన్నగూడెం గ్రామానికి చెందిన ఇమ్మడి రాము సత్తుపల్లిలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ అక్కడే ఉంటున్నాడు. గతేడాది ఫిబ్రవరిలో సత్తుపల్లి మండలం కాకర్లపల్లి గ్రామంలోని కిరణా దుకాణ యజమాని గార్లపాటి పుష్పావతిని టూత్‌పేస్ట్ ఇవ్వమని అడిగి ఆమె వెనుకకు తిరిగే సరికి మెడలోని 20 గ్రాముల బంగారు నాన్‌తాడు లాక్కెళ్లాడు. జులైలో తుమ్మూరు రామారావు వీధిలోని ఇంట్లో ఒంటరిగా ఉన్న వృద్ధురాలు జంగాల కనకరత్నం ఇంటికి వెళ్లి ఇల్లు అద్దెకు కావాలంటూ మాటల్లో దింపి మెడలోని 34 గ్రాముల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. అక్టోబర్‌లో సీపీఎం ఆఫీస్ రోడ్‌లో నివాసం ఉంటున్న బొమ్మిరెడ్డి విజయలక్ష్మి మెడలోని బంగారు గొలుసును లాక్కొని వెళ్లాడు. రూ.50 వేలు విలువైన బజాజ్ పల్సర్ ద్విచక్రవాహనాన్ని కూడా చోరీ చేసినట్లు పోలీసుల విచారణలో తేలటంతో నిందితుడిని శనివారం సాయంత్రం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. సత్తుపల్లి ఎస్‌ఐ కుశకుమార్ పాల్గొన్నారు.

ప్రహరీ ధ్వంసం.. కేసు నమోదు

రఘునాథపాలెం: మండల కేంద్రంలోని పద్మశాలి సంఘానికి కేటాయించిన స్థలం ప్రహరీని ధ్వంసం చేసిన ఘటనపై రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. సీఐ శ్రీధర్ కథనం ప్రకారం.. ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ పద్మశాలి సంఘం ఖమ్మం జిల్లా కమిటీకి రఘునాథపాలెం రెవెన్యూ సర్వే నంబర్ 17/3లో 29.5 కుంటల భూమిని 29 ఏళ్ల లీజుకు కేటాయించింది. సదరు స్థలంలో సంఘం ఆధ్వర్యంలో ప్రహరీని నిర్మించడంతో పాటు సంఘానికి కేటాయించిన స్థలం బోర్డును ఏర్పాటు చేశారు. ఈ భూమిని ఆనుకొని వ్యవసాయం చేస్తున్న అదే గ్రామానికి చెందిన వీరన్న ప్రహరీని ధ్వంసం చేశాడని, ఇది తమకు కేటాయించిన భూమి అంటే దౌర్జన్యం చేస్తున్నాడంటూ సంఘం జిల్లా నాయకుడు పి.జనార్దన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు.

పాఠశాలలో కంప్యూటర్లు చోరీ

సుజాతనగర్: మండలంలోని రాఘవాపురం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో కంప్యూటర్లు చోరీ అయిన ఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగు చూసింది. పాఠశాలలోని ఓ గదిలో 5 కంప్యూటర్లు, 3 బ్యాటరీలు ఉన్నాయి. ఈ నెల 20వ తేదీన ఉపాధ్యాయులు వెళ్లి చూడగా ఆ గదికి ఉండాల్సిన పాత తాళం స్థానంలో మరో తాళం ఉండటంతో లోపల ఉన్న కంప్యూటర్లు చోరీ అయినట్లు గుర్తించారు. కాగా ఘటనపై హెచ్ఎం ఎం.రుక్మిణీ పోలీసులకు ఫిర్యాదు చేయగా, దర్యాప్తు చేపట్టామని ఎస్‌ఐ సోమేశ్వర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



గార్లపాటి నరసింహారావు మృతదేహం

తల్లాడ: స్థానిక శ్రీకృష్ణ కోల్డ్ స్టోరేజ్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. జులూరుపాడు నుంచి వైరాకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న గార్లపాటి నరసింహారావు (35)ను తల్లాడ వైపు నుంచి సారపాక వెళ్తున్న సుబాబుల్ లోడు లారీ ఎదురుగా ఢీకొట్టింది. దీంతో నరసింహారావుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ సురేశ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

టేకులపల్లి: పురుగులమందు తాగిన యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఎస్‌ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. మండలంలని మద్రాస్‌తండాకు చెందిన జర్పుల సురేశ్(32)కు సుమారు ఎనిమిదేళ్ల కిందట సునీతతో వివాహమైంది. వారికి పాప, బాబు ఉన్నారు. మద్యానికి బానిసైన సురేశ్ కొంతకాలంగా భార్యతో గొడవపడుతున్నాడు. మద్యం తాగొద్దని భార్య ఎంత చెప్పినా వినకుండా సురేశ్ తాగి వచ్చి గొడవపడుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 19న సురేశ్ పురుగులమందు తాగగా కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ చెప్పారు.

ఫిట్స్‌తో వ్యక్తి..

పాల్వంచరూరల్: చికెన్‌షాపులో పనిచేస్తున్న వ్యక్తికి ఫిట్స్ రావడంతో మృతి చెందిన సంఘటన పెద్దమ్మగుడి సమీపంలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన బానోతు మోతీలాల్(40) పెద్దమ్మగుడి సమీపంలోని ఓ చికెన్‌షాపులో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం షాపులో పనిచేస్తూనే ఒక్కసారిగా కిందపడిపోయాడు. షాపు నిర్వాహకులు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ఫిట్స్, గుండెపోటు కారణాలతో మృతి చెందాడని మృతుడి తండ్రి భద్రు ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి.శ్రీనివాస్ తెలిపారు.

చింతచెట్టు కూలిపడటంతో వ్యక్తి...

పాల్వంచ: చింత చెట్టు కూలిపడటంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని వెంగళరావుకాలనీకి చెందిన అక్కల రామ్మూర్తి ఇంట్లో ఉన్న చింత చెట్టు నరికే పనిని మండలంలోని కొత్తసూరారం గ్రామానికి చెందిన మూడ్ కిషన్ (40), బానోతు రమేశ్, గుగులోతు భీమా, హలావత్ బాలాజీ కలిసి చేపట్టారు. మూడ్ కిషన్ చెట్టు ఎక్కి నరుగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు చెట్టు కూలి కిషన్‌పై పడటంతో తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆయన్ను పాల్వంచలోని ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుమారుడు మహేశ్‌కుమార్ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేకల కాపరి...

కొత్తగూడెం రూరల్: మేకలను మేపేందుకు వెళ్లిన ఓ వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. లక్ష్మీదేవిపల్లి మండలం పునుకుడు చెలక పంచాయతీకి చెందిన పాయం చిన్న వెంకయ్య (60) మేకలు మేపేందుకు వెళ్లి కింది పడిపోయి ఉన్నాడు. స్థానికులు గమనించి కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు.

వివాహిత అదృశ్యం

అశ్వారావుపేటరూరల్: వివాహిత కనిపించకుండా పోవడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అదనపు ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. అశ్వారావుపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని వివాహిత తన భర్తతో గొడవపడి శనివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి ఆమె రాకపోవడంతో ఆమె భర్త ఆదివారం ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాతు పిల్లతో ఆడుకుందామనుకుంటే..

నీటిలో మునిగి ప్రాణాలే కోల్పోయారు..



కోలా సిద్ధార్థ (ఫైల్)



ఇసరం వికాస్ (ఫైల్)



ప్రమాదానికి కారణమైన నీటిగుంత

సత్తుపల్లి: బాతు పిల్లతో ఆడుకుందామనుకున్నారు.. దానిలా నీటిలో అటూ.. ఇటూ.. తిరుగుదామనుకున్నారు.. కానీ, బాతును తేలియాడనిచ్చిన నీరు చిన్నారులను ముంచేసింది.. ముక్కుపచ్చలారని చిన్నారులను.. బంగారు భవిష్యత్ ఉన్న ఆ పిల్లలను విగతజీవులుగా మార్చింది.. వారి మృతదేహాలను చూసిన తల్లిదండ్రు లు గుండెలు బద్ధలయ్యేలా విలపించారు.. దిక్కులు పిక్కటిల్లేలా రోదించారు.. హాహాకారాలు చేస్తూ గుండెలు బాదుకున్నారు.. వీరి ఆర్తనాదాలతో సత్తుపల్లి మండలంలోని కాకర్లపల్లి గ్రామం శోకసంద్రంలో మునిగింది. ఎస్సీకాలనీకి చెందిన కోలా సిద్ధార్థ (12), ఇసరం వికాస్ (7), చేవల రుషి కలిసి ఇళ్లకు సమీపంలో ఉన్న హెచ్.పుల్లయ్య వరిపొలంలోని నీటిగుంత దగ్గరికి వెళ్లారు. వికాస్ బాతుపిల్ల కాలికి తాడు కట్టి నీళ్లల్లో ఆడిస్తున్నాడు. ఈ క్రమంలో రాయిపై నిల్చొని వంగి ఆడిస్తుండగా జారిపోయాడు. గమనించిన సిద్ధార్థ.. వికాస్ కాళ్లను పట్టుకొని కాపాడే యత్నంలో ఆతను కూడా నీటిలో పడిపోయాడు. ఒడ్డున ఉన్న రుషి పరిగెత్తుకుంటూ వచ్చి సమీపంలో వాలీబాల్ ఆడుతున్న వికాస్ తండ్రి శ్రీను, యువకులకు చెప్పాడు. హుటాహుటిన వారు వెళ్లి నీటిలో మునిగిన సిద్ధార్థ, వికాస్‌ను బయటకు తీసి సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఇద్దరు చిన్నారులు మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

కూలి పనులే ఆధారం

మృతుడు కోలా సిద్ధార్థ తండ్రి మహేశ్ ఆటోడ్రైవర్. తల్లి నాగమణి వ్యవసాయ కూలీ. వికాస్ తండ్రి శ్రీను ఐరన్ రాడ్‌బెండింగ్ వర్కర్. తల్లి గంగ కూలి పనులు చేస్తుంటారు. ఆదివారం సెలవు కావటంతో పిల్లలు ముగ్గురు ఎప్పటిలాగే ఆడుకోవటానికి వెళ్లారు. సిద్ధార్థ 6వ తరగతి, వికాస్ ఒకటో తరగతి కాకర్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. సిద్ధార్థకు తమ్ముడు బాలు, వికాస్‌కు తమ్ముడు వెంకట్ ఉన్నారు. ఇద్దరు ఒకే వీధి పిల్లలు మృతిచెందటంతో కాకర్లపల్లి ఎస్సీకాలనీ కన్నీటిసంద్రమైంది. సత్తుపల్లి పట్టణ సీఐ మోహన్‌బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతుల కుటుంబాల నుంచి వివరాలను సేకరించారు.



వికాస్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ మోహన్‌బాబు

అలరించిన 'నాన్న.. నేనొచ్చేస్తా..'



నాన్న నేనొచ్చేస్తా నాటికలోని దృశ్యం

ఖమ్మంగాంధీచౌక్: నెల నెలా వెన్నెల కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాత్రి ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ప్రదర్శించిన నాన్న.. నేనొచ్చేస్తా..! నాటిక ప్రేక్షకులను ఆలోచింపజేసింది. ఆడపిల్లల పెళ్లిళ్ల, ఆ తరువాత జరుగుతున్న పరిణామల ఇతివృత్తంగా రూపొందించిన నాటికను ప్రదర్శించారు. పెళ్లైన కొంత కాలానికే వైవాహిక జీవితంలో భార్య, భర్తల మధ్య వచ్చిన మనస్పర్థలను తల్లిదండ్రులు తీర్చలేక ఇబ్బంది పడుతున్నారు. అమ్మాయిలు భర్త నుంచి దూరమై పుట్టింటికి వచ్చి తాను ఇబ్బందులు పడుతూ, తల్లిదండ్రులను మానసిక ఇబ్బందులకు గురిచేసే దృశ్య రూపమే ఈ నాటిక. గుంటూరు శ్రీఅమృత లహరి థియేటర్ ఆర్ట్స్ రూపొందించిన నాన్న.. నేనొచ్చేస్తా..! నాటికను గంటి రాజేశ్వరి మూలకథగా తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచించగా, అమృతలహరి దర్శకత్వం వహించారు. వీసీహెచ్‌కే ప్రసాద్, ఎస్.అమృతవర్షిణి, లహరి, హసన్, తాళ్లబత్తుల వెంకటేశ్వరరావు పాత్రధారులు. ముందుగా శారదాదేవి చిత్రపటానికి అతిథులు తిరుమలాచారి, మరిగంటి అర్వపల్లి లక్ష్మీనారాయణ, డాక్టర్ రాంబాబు, డాక్టర్ ముక్కపాటి కోటేశ్వరరావు పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు మోటమర్రి జగన్మోహన్‌రావు, కార్యదర్శి అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్షులు డాక్టర్ నాగబత్తిని రవికుమార్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నామా లక్ష్మీనారాయణ, సదానందం, పుతుంబాక కృష్ణ ప్రసాద్, నందిగామ కృష్ణ, మారుతి కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిమిక్రీ శ్రీనివాస్, కుమారి మీనా కూచిపూడి నృత్య ప్రదర్శనతో ప్రేక్షకులను అలరించారు.

క్లుప్తంగా...

అంతా అప్పులే.. అభివృద్ధి ఎక్కడ?

ఏపీ కాంగ్రెస్ నూతన చీఫ్ షర్మిల విమర్శలు



సాక్షి, అమరావతి/పెనమలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.మూడు లక్షల కోట్లకు పైగా అప్పులు తెచ్చినా రాష్ట్రంలో అభివృద్ధి కనిపించడం లేదని ఏపీ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన షర్మిల విమర్శించారు. ఆదివారం విజయవాడలో ప్రమాణ స్వీకారం అనంతరం ఆమె మాట్లాడుతూ కార్పొరేషన్ల లోన్లతో కలిపి రాష్ట్ర అప్పులు రూ.పది లక్షల కోట్లకు చేరాయన్నారు. విభజన నాటికి రాష్ట్ర అప్పులు రూ.లక్ష కోట్లు ఉంటే చంద్రబాబు అమరావతి రాజధాని అంటూ 3 డీ గ్రాఫిక్స్ చూపించి రూ.రెండు లక్షల కోట్లు అప్పు చేశారని చెప్పారు. వైఎస్ జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రత్యేక హోదా కోసం ప్రతి రోజూ కొట్లాడి దీక్షలు చేశారని, ఎంపీలంతా మూకుమ్మడి రాజీనామా చేస్తే హోదా ఎందుకు రాదో చూస్తానన్నారని, కానీ అధికారంలోకి వచ్చాక నిజమైన ఉద్యమం చేయలేదని విమర్శలు చేశారు. 'జగన్ వచ్చాక మూడు రాజధానులని చెప్పి ఒక్కటి కూడా కట్టలేదు. ఆంధ్ర రాష్ట్రంలో, కనీసం విజయవాడలో ఒక్క మెట్రో అయినా ఉందా? కొత్త పరిశ్రమలైనా వచ్చాయా? ఒక్కరికైనా ఉద్యోగం వచ్చిందా? రోడ్లయినా నిర్మించగలిగారా? ప్రభుత్వ ఉద్యోగులకు సమయానికి జీతాలు ఇవ్వటానికి కూడా డబ్బులు లేవు' అని షర్మిల విమర్శించారు. మణిపూర్‌లో 2 వేల చర్చిలను ధ్వంసం చేసినా, అరవై వేల మంది క్రైస్తవులను నిర్వాసితులను చేసినా జగన్ మాట్లాడలేదన్నారు. వైఎస్సార్ చనిపోయాక పోలవరం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. కాగా, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడిగా గిడుగు రుద్రరాజు బాధ్యతలు స్వీకరించగా మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

'బ్రో'.. బాబెప్పుడూ ఇంతే!

సీట్లపై ఆఖరి నిమిషం దాకా నాన్చే ధోరణిలో చంద్రబాబు

చివర్లో అతి కొద్ది సీట్లతో పవన్‌కు చెక్ పెట్టే యోచన

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

బాబు కోసం బలి!

టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు చివరి అస్త్రంగా షర్మిల

వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును సీఎంను చేయడం ఎలా? అన్నదే షర్మిల లక్ష్యంగా కనిపిస్తోందని వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి విమర్శించారు. సంక్షేమ పథకాలు, సుపరిపాలనతో ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న సీఎం జగన్‌ను రాజకీయంగా ఎదుర్కోలేక అన్ని అస్త్రాలు ప్రయోగించిన చంద్రబాబు చివరి ప్రయత్నంగా షర్మిలను తీసుకొచ్చారని చెప్పారు. చంద్రబాబుకు ప్రయోజనం చేకూర్చడం కోసమే షర్మిల పీసీసీ చీఫ్‌గా రాష్ట్రానికి వచ్చారన్నది ప్రజలందరికీ అర్థమవుతోందన్నారు. ఇదంతా చంద్రబాబు ఎత్తుగడేనని చెప్పారు. గతంలో షర్మిలపై వ్యక్తిత్వ హననానికి పాల్పడిన ఎల్లో మీడియా ఇప్పుడు ఆమెను భుజానికెత్తుకోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో సజ్జల మీడియాతో మాట్లాడారు. నిన్నటిదాకా తెలంగాణలోనే తన బతుకు, చావు అంటూ వైఎస్సార్ టీపీని నడిపిన షర్మిల ఇప్పుడు హఠాత్తుగా పీసీసీ చీఫ్‌గా రాష్ట్రానికి ఎందుకొచ్చారో చెప్పాలన్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి బతికి ఉంటే కాంగ్రెస్‌పై ఉమ్మేసేవారంటూ నిన్నటిదాకా తూర్పారబట్టిన షర్మిల ఇప్పుడు రాష్ట్రంలో ఆ పార్టీకి నేతృత్వం వహించడానికి కారణాలేంటో చెప్పాలని నిలదీశారు. అడ్డగోలుగా విభజించి ప్రత్యేక హోదాను చట్టంలో చేర్చకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిన కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించుకుందన్నారు. రాష్ట్రంలో గత ఎన్నికల్లో నోటాకు 1.28 శాతం ఓట్లు రాగా కాంగ్రెస్‌కు 1.17 శాతం ఓట్లు వచ్చాయని సజ్జల గుర్తు చేశారు. అలాంటి కాంగ్రెస్‌ను బతికించడమంటే శవానికి జీవం పోయటమేనని ఎద్దేవా చేశారు. సజ్జల ఏమన్నారంటే...

భాష, యాస బాధాకరం..

పీసీసీ చీఫ్‌గా ప్రమాణ స్వీకారం సందర్భంగా షర్మిల మాట్లాడిన భాష, యాస దివంగత వైఎస్సార్ కుటుంబ సన్నిహితులకు, అభిమానులకు, ఆయన ఆశయాల సాధనకు పేటెంట్ కలిగిన వైఎస్సార్‌సీపీ నాయకులకు బాధ కలిగించింది. సీఎం జగన్ మహానేత వైఎస్ తనయుడిగానే కాకుండా రాజకీయ వారసుడిగా, వైఎస్సార్ ఆశయాల సాధనకు ప్రజలతో మమేకమవుతూ నిబద్ధతతో పని చేస్తున్నారు. షర్మిల వ్యవహార శైలి చూస్తే జాలి కలుగుతోంది. కేవీపీ, రఘువీరారెడ్డి మినహా కాంగ్రెస్‌లో షర్మిలకు పరిచయం ఉన్న వారెవరూ లేరు.

ప్రసంగాన్ని తయారు చేసి పంపించారు..

రాష్ట్రంలో ఉనికిలో లేని కాంగ్రెస్ పార్టీకి హఠాత్తుగా అధ్యక్షురాలిగా వచ్చి చంద్రబాబు డైలాగులనే షర్మిల చెబుతుంటే జాలి కలగక మరేం అనిపిస్తుంది? జగన్‌కు మద్దతుగా గతంలో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్న షర్మిల ఇప్పుడు ఆయన నియంత అంటూ విమర్శలు చేస్తున్నారు. చంద్రబాబు తన పాలనలో ప్రజలకు ఏం చేశారో చెప్పుకునేందుకు ఏమీ లేకపోవడంతో 56 నెలలుగా కొనసాగుతున్న సీఎం జగన్ సంక్షేమ పాలన నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారు. తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పకుండా ఆమె డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి ఎందుకు వచ్చారు? రాహుల్ గాంధీని ప్రధానమంత్రి చేయడమే లక్ష్యమైతే ఇక్కడకు వచ్చి ఆమె చేయగలిగింది ఏముంది? ఆమె లక్ష్యం.. రాహుల్ గాంధీని ప్రధానిని చేయడం కాదు.. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడం ఎలా అన్నదే. వైఎస్ అభిమానుల ఓట్లు చీల్చడానికి షర్మిల తోడ్పడతారన్నదే చంద్రబాబు చివరి ఎత్తుగడ. క్రిస్టియన్ మైనార్టీలు, దళితుల ఓట్లు చీల్చడమే లక్ష్యంగా ప్రసంగాన్ని తయారు చేసి షర్మిలకు ఇచ్చి పంపారు.

ఆ అవసరం, అవకాశం కూడా లేదు..

రాష్ట్రంలో ఉన్నది ఒకటే కాంగ్రెస్ పార్టీ.. అది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాత్రమే. హస్తం గుర్తు కాంగ్రెస్ ఎప్పుడో పోయింది. వైఎస్సార్ వారసుడిగా సీఎం జగన్ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నారు. రాష్ట్రంలో మైనార్టీలు, క్రైస్తవులు, ఎస్సీలతోపాటు అందరికీ రక్షణ కల్పించే శక్తి, నిబద్ధత తనకుందని పన్నెండేళ్లుగా సీఎం జగన్ రుజువు చేసుకుంటూనే ఉన్నారు. మతం ఏదైనా వ్యక్తిగతంగానే ఉండాలి కానీ రాజకీయంగా, పరిపాలనలో దాని ప్రభావం ఉండకూడదని బలంగా విశ్వసించే వ్యక్తి సీఎం జగన్. ఏ దేవుడ్ని ఎవరు కొలిచినా అన్నిటి భావం ఒకటే అని నమ్మిన వ్యక్తిగా వాటికి అతీతంగా ఉన్నారు. ఎవరికి అన్యాయం జరిగినా వారిని రక్షించి అక్కున చేర్చుకుంటున్నారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు మన వ్యక్తిగత విశ్వాసాలు కాకుండా రాష్ట్రం అవసరాలు, ప్రజల ఆకాంక్షలే మన రాజకీయ విధానాలను నిర్దేశించాలని సీఎం జగన్ బలంగా నమ్ముతారు. కేంద్రంలో ఎవరున్నా వారితో సమన్వయం చేసుకుంటూ వీలైనంత వరకూ రాష్ట్రానికి మేలు చేయాలని భావిస్తారు. సీఎం జగన్ చెల్లెలుగా, మహానేత వైఎస్ కుమార్తెగా తనను ఆదరించే వారి అభిమానాన్ని సైతం పోగొట్టుకునే దిశగా షర్మిల అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

హోదాపై కాంగ్రెస్ తరఫున వివరణ ఇవ్వాలి..

కాంగ్రెస్ పార్టీ చంద్రబాబుతో కుమ్మక్కై అడ్డగోలుగా రాష్ట్రాన్ని విభజించి తీరని అన్యాయం చేసింది. రాష్ట్ర హక్కులను రక్షించకుండా, ప్రత్యేక హోదాను చట్టంలో చేర్చకుండా ద్రోహం చేసింది కాంగ్రెస్సే. ప్రత్యేక హోదాను చట్టంలో చేర్చి ఉంటే ఇప్పుడింత పోరాడాల్సిన అవసరమే ఉండదు కదా? తాను చేసిన తప్పులకు సంజాయిషీ ఇచ్చుకోవాల్సిన కాంగ్రెస్ పార్టీ అడ్రస్ లేకుండా పోయింది. ఆ పార్టీ తరఫున వకాల్తా పుచ్చుకున్న షర్మిల వాటిపై సీఎం జగన్‌ను ప్రశ్నించడం విచిత్రం. కాంగ్రెస్ తరఫున ప్రత్యేక హోదా, రాజధానికి నిధులపై షర్మిల వివరణ ఇవ్వాలి. ప్రత్యేక హోదాపై సీఎం జగన్ ఒకే మాటకు కట్టుబడ్డారు. పోరాటం ఏ పద్ధతుల్లో చేయాలో అలా కొనసాగించడంతోపాటు కేంద్రంపై ఒత్తిడి పెంచి మనపై ఆధారపడే పరిస్థితి వచ్చే వరకూ ఆ అంశాన్ని సజీవంగా ఉంచుతున్నాం. ఎప్పటికప్పుడు హోదా అంశాన్ని ప్రస్తావిస్తూ సరైనా అవకాశం రాగానే సాధించుకునే దిశగా ప్రయత్నాలు చేస్తున్నాం. అందులో భాగంగా ప్రధాని సమక్షంలోనే విశాఖ సభలో సీఎం జగన్ హోదా అంశాన్ని గుర్తు చేశారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ ద్రోహం..

ఏకపక్ష విభజనతో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన కాంగ్రెస్ మహానేత వైఎస్ కుటుంబానికి తీరని ద్రోహం చేసింది. 2004, 2009లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి వైఎస్ చేసిన కృషే ప్రధాన కారణమని నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ పలు సందర్భాల్లో చెప్పారు. వైఎస్ మరణానంతరం అక్రమ కేసులు బనాయించి ఆయన పేరును నేరుగా ఎఫ్ఐఆర్‌లో పెట్టిన పార్టీ కాంగ్రెస్. వైఎస్సార్ తనయుడు జగన్‌ను అక్రమంగా 16 నెలలు జైల్లో నిర్బంధించిన పార్టీ కాంగ్రెస్. శంకర్రావు, ఎర్రన్నాయుడు, అశోక్ గజపతిరాజు కలిసి ఆ కేసులు వేశారు. సోనియాగాంధీ చెబితేనే కేసులు పెట్టామని శంకర్రావు పలు మార్లు మీడియాకు చెప్పారు. సోనియా చెప్పినట్టుగా జగన్ విని ఉంటే కేసులు పెట్టేవాళ్లం కాదని అప్పట్లో కాంగ్రెస్‌లో కీలక భూమిక పోషించిన కేంద్ర మాజీ మంత్రి గులాంనబీ ఆజాద్ కూడా చెప్పారు. అంటే అవన్నీ అక్రమ కేసులేనని తెలిసిపోతోంది.



అంబేడ్కర్ స్మృతి వనం.. పులకించిన జనం

ఎన్టీఆర్ జిల్లా, విజయవాడలోని సామాజిక న్యాయ మహా శిల్పం (అంబేడ్కర్ విగ్రహం), అంబేడ్కర్ స్మృతి వనం ఆదివారం సందర్శకులతో కిటకిటలాడింది. సెలవు రోజు కావడంతో కుటుంబ సమేతంగా వచ్చిన వారితో ఉదయం నుంచే రద్దీ నెలకొంది. సాయంత్రం మరింత పెరిగింది. విద్యుత్ దీపాల వెలుగుల్లో స్మృతి వనం, అంబేడ్కర్ బొమ్మలు, విజువల్ షో వంటివి చూసి పులకించిపోయారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

ఏపీ అభివృద్ధిపై చాలెంజ్‌కు సిద్ధమా?

- పక్క రాష్ట్రం నుంచి వచ్చి ఇక్కడ అభివృద్ధి జరగలేదంటే ఎలా?
- వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి



సాక్షి, విశాఖపట్నం/తగరపువలస: ఏపీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంపై చాలెంజ్‌కు సిద్ధమా? తమతో వస్తే.. తాము చేసిన అభివృద్ధి ఎక్కడ జరిగిందో చూపిస్తామని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి సవాల్ విసిరారు. పక్క రాష్ట్రం నుంచి వచ్చి ఇక్కడ అభివృద్ధి జరగలేదనడానికి ఆమె ఎవరు.. అంటూ మండిపడ్డారు. మొన్నటి వరకు తెలంగాణ బిడ్డనని తిరిగి.. అక్కడ ఎందుకు పోటీ చేయలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. షర్మిల కాదు కదా.. ఎవరు వచ్చినా తమ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టలేరని, వచ్చేది మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనన్నారు. ఆదివారం మధురవాడ ఐటీ సెజ్‌లో గల ఆయన క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిశలు శ్రమించి అధికారంలో నిలిపిన వైఎస్సార్ పేరు ఎఫ్ఐఆర్‌లో చేర్చిన విషయాన్ని మరిచి పోయావా? వైఎస్సార్ దయతో కేంద్రంలో అధికారాన్ని పొంది.. ఆయన మరణం తర్వాత వైఎస్సార్ కుమారుడిని 16 నెలలు అన్యాయంగా జైల్లో పెట్టిన సోనియాగాంధీతో ఎలా కలవాలనిపించింది' అని ప్రశ్నించారు. రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం అక్రమంగా రాష్ట్ర విభజన చేసిన కాంగ్రెస్‌లో ఆమె ఎందుకు చేరారో? ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌కు నిజమైన వారసులెవరో రానున్న ఎన్నికల్లో ప్రజలే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరి మమ్మల్ని టార్గెట్ చేయడం ఎంతవరకు సమంజసమో సమీక్షించుకోవాలని షర్మిలకు హితవుపలికారు. ఏపీ ప్రజలపై నిజంగా ప్రేమే ఉంటే అవినీతికి పాల్పడ్డ చంద్రబాబును షర్మిల ప్రశ్నించాలని, రాష్ట్రాన్ని అధోగతి పాల్జేసిన చంద్రబాబును నిలదీయాలని సూచించారు. అంతేగానీ దేశంలో ఎక్కడా లేని విధంగా, రాష్ట్రంలో ఎప్పుడూ లేని విధంగా సంక్షేమాభివృద్ధి చేస్తున్న ప్రభుత్వంపై విమర్శలు చేస్తావా.. అని ప్రశ్నించారు.

ఊపందుకున్న కులగణన

41.63 లక్షల కుటుంబాల్లో పూర్తయిన వివరాల నమోదు

సాక్షి, అమరావతి: చరిత్రాత్మక కులగణన కార్యక్రమం ఊపందుకుంది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తుండడంతో ఆదివారం కూడా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు తమ పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఆయా కుటుంబ సభ్యుల సామాజిక, ఆర్థిక స్థితిగతుల వివరాలు నమోదు చేశారు. శుక్రవారం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఈ కార్యక్రమం మొదలు కాగా, ఆదివారం రాత్రి వరకు 41,63,957 కుటుంబాలకు సంబంధించి వివరాల నమోదు పూర్తయినట్టు అధికారులు వెల్లడించారు. ఆదివారం ఒక్కరోజే 20.36 లక్షల కుటుంబాల వివరాలు నమోదు చేసినట్టు తెలిపారు. మూడు రోజులుగా గ్రామీణ ప్రాంతాల్లో 11,085 గ్రామ సచివాలయాల పరిధిలో 30.95 లక్షల కుటుంబాల వివరాలు నమోదు పూర్తి కాగా, పట్టణ ప్రాంతాల్లో 3866 వార్డు సచివాలయాల పరిధిలో 10.68 లక్షల కుటుంబాల వివరాల నమోదు పూర్తయినట్టు అధికారులు వివరించారు.

జిల్లా వార్తలు

ముగిసిన మత్స్య విద్యార్థుల శిక్షణ

కూసుమంచి : వనపర్తి జిల్లా పెబ్బేరులోని మత్స్య కళాశాలకు చెందిన బీఎఫ్ఎస్సీ మూడో బ్యాచ్ విద్యార్థులకు 'క్షేత్ర స్థాయిలో మత్స్య పని – అనుభవం' అనే అంశంపై పాలేరు మత్స్య పరిశోధనా కేంద్రంలో నిర్వహిస్తున్న శిక్షణ ఆదివారంతో ముగిసింది. పరిశోధనా కేంద్రం సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ శ్యాంప్రసాద్ పర్యవేక్షణలో శాస్త్రవేత్తలు రవీందర్, నాగరాజు, భార్గవి పలు అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చేపల చెరువుల, హేచరీల యాజమాన్య పద్ధతులు తెలుసుకోగా, చేపల జీవ వైవిధ్య విశ్లేషణ, మార్కెటింగ్, వలల తయారీ, మత్స్యకారుల ఆర్థిక స్థితిగతులు తదితర అంశాలపై శాస్త్రవేత్తలు వివరించారు. ప్రయోగశాల ద్వారా చేపల చెరువుల్లో నీటి నాణ్యత ప్రమాణాలు, వ్యాధి నిర్ధారణ, నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు.

భద్రగిరిలో నేడు ప్రత్యేక కార్యక్రమాలు

భద్రాచలంటౌన్: అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈఓ రమాదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయంలో నిత్య కల్యాణ మండపంలో ఉదయం 7 నుంచి 7.30 వరకు స్వామివారికి సువర్ణ పుష్పార్చన, అనంతరం ఆలయం నుంచి ప్రచార రథంలో అంబేడ్కర్ సెంటర్ వరకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ శోభాయాత్రలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు 500 కాషాయ జెండాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అలాగే సాయంత్రం ఆలయ ప్రాంగణంలో సుందరాకాండ పారాయణం, దీపోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆమె కోరారు.

కిన్నెరసానిలో పర్యాటకుల సందడి

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని కిన్నెరసానిలో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. జిల్లా నలుమూలలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా డ్యామ్ పైనుంచి జలాశయాన్ని, డీర్‌పార్కులోని దుప్పులను వీక్షించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆనందోత్సాహాల నడుమ గడిపారు. 444 మంది పర్యాటకులు కిన్నెరసానిలోకి ప్రవేశించడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.15,445, 200 మంది బోటు షికారు చేయడం ద్వారా పర్యాటకాభివృద్ధి సంస్థకు రూ.11,070 ఆదాయం లభించినట్లు నిర్వాహకులు తెలిపారు.

రోడ్డెక్కుతున్నారు..



నగరంలోని ఓ హాస్టల్ విద్యార్థులను తమ కళాశాలకు పంపించాలని కోరుతున్న మైనార్టీ గురుకులాల అధ్యాపకులు

- ప్రవేశాల కోసం మైనార్టీ గురుకుల అధ్యాపకుల వేట
- ఎక్కువ మంది దరఖాస్తు చేసుకునేలా హాస్టళ్లు, ఇళ్లకు వెళ్లి ప్రచారం
- పాఠాలు బోధించే సమయాన బయటకు వెళ్తుండడంపై విమర్శలు
- ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్న వేళ విద్యార్థుల సన్నద్ధతపై నిర్లక్ష్యం

ఖమ్మంమయూరిసెంటర్: పేద విద్యార్థులకు ఉన్నత చదువులు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం గురుకులాలను ఏర్పాటు చేసింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలను ఏర్పాటు చేసి ఇంటర్, డిగ్రీ కోర్సులను విద్యార్థులకు అందుబాటులో ఉంచింది. పదో తరగతి లోపు గురుకులాలకు పోటీ ఉండడంతో ఎలాంటి ప్రచారం లేకుండానే విద్యార్థులు చేరుతున్నారు. ఇక ఇంటర్, డిగ్రీ కోర్సులకు సంబంధించి గురుకులాలు ఉండగా.. ఎస్సీ గురుకులాల్లో మినహా మిగిలిన వాటిలో విద్యార్థుల కోసం కొంత ఆపసోపాలు పడుతున్నట్లు తెలుస్తోంది. మరోపక్క ప్రైవేటు కళాశాలల యాజమాన్యం పీఆర్‌ఓలను నియమించుకుని విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చి కళాశాలల్లో చేర్చుకుంటున్నట్లుగా మైనారిటీ గురుకులాల సిబ్బంది కూడా పాట్లు పడుతున్నారు. 2024లో పదో తరగతి వార్షిక పరీక్షలు రాసే విద్యార్థులను ముందే కలిసి తమ గురుకులాల్లో చేరాలని మైనారిటీ గురుకుల కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది కోరుతున్నారు. పాఠశాలలకు వెళ్లి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, ప్రిన్సిపాళ్లకు కళాశాలల వివరాలను అందజేస్తున్నారు.

నియోజకవర్గానికి ఒక గురుకులం..

ఉమ్మడి జిల్లాలోని ప్రతీ నియోజకవర్గానికి ఒక గురుకులాన్ని మైనార్టీ గురుకుల విద్యాలయాల సంస్థ నిర్వహిస్తోంది. అలాగే, అదనంగా ఖమ్మంలో రెండు, కొత్తగూడెంలో ఒకటి ఏర్పాటు చేయగా ఉమ్మడి జిల్లాలో 13 గురుకులాలు కొనసాగుతున్నాయి. ఖమ్మంలో బాలికలు – 1, 2 గురుకులాలు ఉండగా.. ఖమ్మం బాలుర గురుకులాన్ని తనికెళ్లలో ఏర్పాటుచేశారు. ఇక సత్తుపల్లి, మధిర, వైరా, పాలేరు(నేలకొండపల్లి), ఇల్లెందు, భద్రాచలం, అశ్వారావుపేటల్లో గురుకులాలు కొనసాగుతున్నాయి. అంతేకాక కొత్తగూడెం బాలురు, బాలికల కళాశాలలు పాల్వంచలో, బూర్గంపాడు గురుకులం సారపాకలో నిర్వహిస్తున్నారు.

వచ్చేనెల 6వ తేదీ వరకు అవకాశం

మైనారిటీ గురుకుల కళాశాలల్లో 2024 – 25 విద్యా సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి వచ్చే నెల 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశముంది. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ఫిబ్రవరి 25న స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఆ తర్వాత ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు కల్పించనున్నారు.

అధికారుల తీరుపై విమర్శలు

గురుకులాల్లో ప్రవేశాల సంఖ్య పెంచాలన్న తపన.. ఇందుకోసం ప్రైవేట్ కళాశాలల కంటే ముందుగానే హాస్టళ్ల విద్యార్థులు, తల్లిదండ్రులను కలవడాన్ని ఎవరూ తప్పు పట్టడం లేదు. కానీ ఇంటర్ వార్షిక పరీక్షలు సమీపిస్తున్న సమయాన కళాశాలల్లో బోధన వదిలేసి బయట అడ్మిషన్ల కోసం ప్రచారం చేయడమేంటనే విమర్శలు వస్తున్నాయి. కళాశాలల్లో ఇంటర్ పరీక్షలు ముగిశాక బయట ప్రచారానికి వెళ్లే అవకాశం ఉన్నా ఇప్పుడు వెళ్లడంపై తల్లిదండ్రులు మండిపడుతున్నారు. వార్షిక పరీక్షల సమయాన విద్యార్థులను దగ్గరుండి చదివించాల్సిన అధ్యాపకులను రోడ్లపై తిప్పుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇక ప్రధాన సబ్జెక్టులైన గణితం, సైన్స్, ఆంగ్లం బోధించే అధ్యాపకులు సైతం ప్రచారానికి వెళ్తుండడంతో కళాశాలలల్లో బోధన కుంటుపడుతోంది. ఈ విషయమై మైనారిటీ గురుకుల ఖమ్మం ఆర్సీఓ అరుణకుమారిని వివరణ కోరగా.. బోధన పీరియడ్లు లేని అధ్యాపకులే అడ్మిషన్ల కోసం వెళ్తున్నారని బదులిచ్చారు. రొటేషన్ ప్రకారం అధ్యాపకులు అలాగే వెళ్తారని స్పష్టం చేయడం గమనార్హం.

ఆర్టీసీకి కొనసాగుతున్న ఆదాయం

ఈనెల 16 నుంచి 20 వరకు రూ.7.56 కోట్లు

ఖమ్మంమామిళ్లగూడెం : సంక్రాంతి పండుగకు వచ్చిన వారి తిరుగు ప్రయాణం కూడా ఆర్టీసీకి భారీగా ఆదాయం తెచ్చిపెట్టింది. రీజియన్ పరిధిలోని ఏడు డిపోల్లో ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు రూ. రూ.7,56,81,000 ఆదాయం వచ్చినట్లు ఆర్ఎం సీహెచ్ వెంకన్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం నుంచి హైదరాబాద్, వరంగల్, నల్గొండ, కరీంనగర్, ఏలూరు, రాజమండ్రి, విజయవాడ, జంగారెడ్డిగూడెం, గుంటూరు, నెల్లూరు తదితర ప్రాంతాలకు బస్సులు నడిపామని పేర్కొన్నారు. ఈ సారి మహాలక్ష్మి టికెట్ల తాకిడి ఉన్నందున్న అధికంగా బస్సులు తిప్పడంతో ఈ మేరకు ఆదాయం నమోదైందని తెలిపారు. ఖమ్మం డిపో పరిధిలో రూ.1,85,18,000 , భద్రాచలంలో రూ.1,41, 29,000, సత్తుపల్లిలో రూ.1,37, 48,000, మణుగూరులో 1,05,83,000, కొత్తగూడెంలో రూ.83.19లక్షలు, మధిరలో రూ.79.13 లక్షలు, ఇల్లెందు డిపోలో రూ.24.71 లక్షల ఆదాయం వచ్చిందని వివరించారు. మొత్తం ప్రయాణికుల సంఖ్య 9,11,848 కాగా అందులో 5,02,097మంది మహాలక్ష్మి మహిళలు ఉన్నారని తెలిపారు.



ఖమ్మం పాత బస్‌స్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ ఇలా..

దర్గా సన్నిధిలో రామయ్య ప్రసాదం తయారీ

- నేడు తలంబ్రాలు, ప్రసాదం ఊరేగింపు
- ఏర్పాట్లలో నిమగ్నమైన నాగుల్‌మీరా దర్గా భక్తులు

ఇల్లెందురూరల్: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ వేడుక సంబురాలను మండలంలోని హజరత్ నాగుల్‌మీరా దర్గా మౌలాచాన్ చిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సాగుతున్నాయి. దర్గా సన్నిధిలో సత్యనారాయణపురం గ్రామ మహిళలు రామయ్య ప్రసాదం తయారు చేసే పనిలో నిమగ్నమయ్యారు. అందుకోసం భక్తులు మహిళలకు అవసరమైన సామగ్రిని సమకూర్చారు. రెండు రోజులుగా దర్గాలో మహిళలు ప్రసాదం తయారు చేస్తున్నారు. అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ సమయంలో ఆయోధ్య నుంచి వచ్చిన తలంబ్రాలు, దర్గా సన్నిధిలో తయారు చేసిన ప్రసాదాన్ని వెండి ఊయలలో ఉంచి హజరత్ నాగుల్‌మీరా దర్గా నుంచి సత్యనారాయణపురం గ్రామంలోని కోదండరామాలయం వరకు భారీ ఊరేగింపును సోమవారం నిర్వహించనున్నట్లు దర్గా భక్తులు తెలిపారు. అనంతరం గ్రామంలోని ప్రతి ఇంటికి ఐదురకాల రామయ్య ప్రసాదాలను పంపిణీ చేయనున్నట్లు వారు తెలిపారు. బాల రాముని విగ్రహ ప్రాణప్రతిష్ఠ వేడుకను పురస్కరించుకొని హజరత్ నాగుల్‌మీరా దర్గా ప్రాంగణంలో సోమవారం సాయంత్రం ప్రత్యేకంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం యువతకు నృత్యపోటీలు నిర్వహించి విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నారు. ఈ వేడుకలను స్వయంగా తిలకించేందుకు భక్తులు ఇప్పటికే దర్గా ప్రాంగణానికి చేరుకుంటున్నారు.



సంప్రదాయబద్ధంగా పిండి సిద్ధం చేస్తున్న మహిళలు



లడ్డూలు తయారు చేస్తున్న మహిళలు

ప్రకృతి విశ్వవిద్యాలయం ఏర్పాటే లక్ష్యం..



పుస్తకం ఆవిష్కరణ చేస్తున్న ప్రతినిధులు

భారత జాతీయ ఆరోగ్య సమ్మేళనంలో పలువురు వక్తలు

నేలకొండపల్లి: భవిష్యత్ తరాలకు ప్రకృతి వైద్యం అందేలా, ఆరోగ్య సమాజం కోసం వైద్యులను తయారుచేసేందుకు నేలకొండపల్లిలో ప్రకృతి యూనివర్సిటీని స్థాపించాలనే లక్ష్యంతో ఉన్నట్లు సిద్ధార్థ యోగా విద్యాలయం, డాక్టర్ రామచంద్ర చారిటబుల్ ట్రస్ట్, డాక్టర్ కేవై రామచందర్‌రావు అన్నారు. మండల కేంద్రంలో యోగా విద్యాలయంలో ఆదివారం నిర్వహించిన భారత జాతీయ ఆరోగ్య సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థి దశ నుంచే మంచి ఆహారపు అలవాట్లు ఉండాలని, అన్ని విద్యాలయాల ద్వారా ఆరోగ్య చైతన్యాన్ని అందించాలని సూచించారు. నేలకొండపల్లిలో ఆరోగ్య యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నానని, అందుకు సహకరించాలని కోరారు. అనంతరం ఉమ్మడి ఏపీ మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో మానసిక ప్రశాంతత కోల్పోతున్నారని, కార్పొరేట్ ఆస్పత్రులు దోపిడీ చేస్తున్నాయని తెలిపారు. సహజ జీవనాన్నే గాంధీ అనుసరించారని, ఆయన ప్రకృతి వైద్యానికే ప్రాధాన్యత ఇచ్చారని వెల్లడించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కాగా, వివిధ రకాల దేశవాలి విత్తనాలు, వంటకాలను ప్రదర్శించారు. ప్రముఖ గేయ రచయిత అందెశ్రీ, సినీ గాయని విజయలక్ష్మి పాటలతో అలరించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త ఈటల జమున, వైద్యులు పద్మ, వివిధ ప్రాంతాలకు చెందిన వారి అభిప్రాయాలను వివరించారు. పలు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.



ముల్లం క్రీడను ప్రదర్శిస్తున్న విద్యార్థులు